## గౌరవనీయ న్యాయమూర్తి శ్రీ గుడి సేవశ్యామ్ ప్రసాద్

## క్రిమినల్ అప్పీలు సంఖ్య: 2858/2018

**తీర్పు:**

II అదనపు జూనియర్ సివిల్ జడ్జి, విజయవాడ వారు, తేది.02-08-2018 నాడు సి.సి.నెం.145/2017లో ఇచ్చిన తీర్పును బట్టి, ఈ అప్పీలుదాఖలు చేయబడినది. దానిలో ఫిర్యాది సి.సి.నెం.145/2017 సి.ఆర్.పి.సి.లోని విభాగములు 190 మరియు 200 క్రింద దాఖలు చేస్తూ, ముద్దాయిని అన్యాక్రాంతయోగ్య పత్ర చట్టము 1881 (నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్ యాక్ట్ 1881) లోని విభాగములు 138/ఆర్/డబ్ల్యు 142 క్రింద ముద్దాయి చేసిన నేరమునకు శిక్ష విధించవలెననియు, మరియు సి.ఆర్.పి.సి. లోని విభాగము 357 క్రింద జరిమాన సొమ్ము నుండి నష్టపరిహారము ముద్దాయి చెల్లించు లాగున తీర్మానించవలెనని కోరెను. కానీ సి.ఆర్.పి.సి.లోని విభాగము 256 క్రింద అట్టి ఫిర్యాదు కొట్టి వేయబడెను.

2. ఫిర్యాది తరపున గాని, ఫిర్యాది గాని హాజరు కాలేదనెడి కారణముచే ట్రయల్ కోర్టువారు ఫిర్యాదును కొట్టివేసిరి.తేది. 10-04-2018 నుండి జామీను ఇవ్వతగని అధికార పత్రమును(ఎన్.బి.డబ్ల్యు) అమలు చేయుటకు అవసరమైన రుసుమును ఫిర్యాది చెల్లించలేదు.అట్టి ఆక్షేపించిన తీర్పు వలన బాధపడిన ఫిర్యాది, అప్పీలును దాఖలు చేసెను. అప్పీలులో కారణములను ఇట్లు తెలిపెను. ఫిర్యాది వాయిదా తేదీలను తప్పుగా వ్రాసుకొనెననియు,దాని వలన కోర్టుకు హాజరు కాలేకపోయిననియు, ఫలితముగా ఫిర్యాదు కొట్టివేయబడెననియు, ఫిర్యాదును రద్దు చేస్తూ ట్రయల్ కోర్టు వారిచ్చినఉత్తర్వులను రద్దు చేయవలెనని కోరెను.

3. అప్పీలుదారుని తరపు న్యాయవాది మరియు , పబ్లిక్ ప్రాసిక్యూటర్ గారి వాదనలు విని ఉన్నాము.

4. రెండవ ప్రతివాది–ముద్దాయికి నోటీసు అందించబడినది మరియు సేవ యొక్క రుజువు దాఖలు చేయబడెను. కానీ రెండవ ప్రతివాది తరపున ఎవరునూ హాజరు కాలేదు. సి.ఆర్.పి.సి.లోని విభాగము 256 ఈ విధముగా తెలుపును.

" ఫిర్యాదికి సమన్లు పంపినప్పుడు నిర్ణీత రోజున ముద్దాయి హాజరు కావాలని నియమించినపుడు లేక ఆ నిర్ణీత రోజు తరువాత ఏ రోజుకైన విచారణను వాయిదా వేసినను, ఫిర్యాది హాజరు కానప్పుడు, మేజిస్ట్రేట్ పైన చెప్పిన ఏ విషయమును లెక్కించకుండా ముద్దాయిని విడుదల చేయవచ్చును. అయనను మేజిస్ట్రేట్ ఏదైనా కారణముచే కేసు విచారణను ఇతర తేదీకి వాయిదా వేయాలని తలంచినపుడు మాత్రము,ముద్దాయి విడుదల జరగదు కాని కేసు వాయిదా వేయబడును."

" ఒకవేళ ఫిర్యాది తరపున న్యాయవాది ఉన్నప్పుడు లేక విచారణాధికారి ద్వారా లేక మేజిస్ట్రేట్ గారు ఫిర్యాది స్వయముగా కోర్టుకు హాజరుగుట అవసరము లేదని అభిప్రాయపడినప్పుడు, ఫిర్యాది యొక్క హాజరును ఉపేక్షించి,విచారణను కేసుతో కొనసాగించ వచ్చును."

" సి.ఆర్.పి.సిలోని విభాగము 256 క్రింద ఫిర్యాదు దోషముతో కూడినదని కొట్టి వేసినప్పుడు , నిర్దోషులుగా ప్రకటించడం స్పష్టంగా ఉంది.ముద్దాయి నేరము నుండి విడుదల పొందినప్పుడు, విడుదల ఉత్తర్వులకు వ్యతిరేకముగా అప్పీలును దాఖలు చేసే వీలును కోడ్ లోని విభాగము 378(4)ను చట్టముపొందు పర్చెను.హెచ్.పి. అగ్రో ఇండస్ట్రీస్ కార్పోరేషన్ లిమిటెడ్ వర్సెస్ ఎం.పి.ఎస్. చావ్లా (1997)2 క్రైమ్స్ 591 (హెచ్ &పి)" .

5. సి.ఆర్.పి.సి.లోని విభాగము 378(4) క్రింద దాఖలు చేసిన ప్రస్తుత అప్పీలు ఈ విధముగా ఉన్నది.

"ఫిర్యాదు మీద దాఖలైన ఏ కేసులోనైన, విడుదల ఉత్తర్వులు జారీ కాబడినప్పుడు,ఫిర్యాది ఉన్నత న్యాయస్థానములో ఒక దరఖాస్తు వేసినప్పుడు, ఉన్నత న్యాయస్థానము వారు విడుదల ఉత్తర్వులకు భిన్నముగా అప్పీలు వేసుకొనుటకు ఫిర్యాదికి స్పెషల్ లీవును మంజూరు చేయును."

6. ప్రస్తుత కేసులో అప్పీలు దారుడు ఫిర్యాదిఅతని ఫిర్యాదును సి.ఆర్.పి.సిలోని విభాగము 256 క్రింద దోషభరితమైనదని ట్రయల్ కోర్టువారు కొట్టివేసిరి అలా కొట్టివేయబడిన

ఫిర్యాదు ముద్దాయిని విడుదల చేయుటకు దారి తీయును. కాబట్టి ఫిర్యాది సి.ఆర్.పి.సి.లోని విభాగము378(4) క్రింద అప్పీలును వేసుకొని ఈ కోర్టు వారిని, లీవు మంజూరు చేయమని కోరెను.ఆవిధముగానే లీవు మంజూరు చేసిరి. ఈ కేసులోని యోగ్యతలను పరిశీలించగా, ట్రయల్ కోర్టువారు ఫిర్యాదును కొట్టివేస్తూ ఇచ్చినవి విపులమైన ఉత్తర్వులు కావు.తేది.10-04-2018 నుండి ఫిర్యాది హాజరు కాలేదనియు,ప్రాసెస్ ఫీజును కూడా కట్టలేదని మాత్రమే ట్రయల్ కోర్టువారు పేర్కొనిరి. అందువలన ఫిర్యాదును కొట్టివేసిరి.

7. అప్పీలుదారుడు, ఫిర్యాది న్యాయవాది ఈ విధముగా విన్నవించెను. అప్పీలుదారుడు వాయిదా తేదిలను తప్పుగ వ్రాసుకోనెననియు, అందువలన ఫిర్యాది తేది. 02-08-2018నాడు గైహాజరు అయినారనియు, మరియు ఫిర్యాది తరపున న్యాయవాది కూడా వాయిదా తారీఖును తెలుపలేదనియు దానితో జామీను ఇవ్వతగని అధికార పత్రము (ఎన్.బి.డబ్ల్యు) అమలు చేయుటకు కట్టవలసిన ప్రాసెస్ ఫీని కట్టలేకపోయెనని తెలిపెను. కావున ఫిర్యాది గైరుహాజరు అగుట, కావాలని గాని, ఇష్ట పూర్వకంగా కానీ చేసినదికాదని చెప్పెను.

ఫిర్యాది యొక్క వివరణ వలన ఫిర్యాది తప్పు చేయలేదని అతని తరపు న్యాయవాది వాయిదా తేదిలను అతనికి తెలుపకపోవుట వలన అతడు ప్రాసెస్ ఫీని కట్టలేకపోయేననియు, దాని వలన కేసు విచారణసాగలేదని తెలియచున్నది.సాధారణముగా, న్యాయవాది కేసు వాయిదా తేది నాడు కోర్టులో హాజరగును మరియు కక్షిదారుల తరపున ప్రాసెస్ ఫీని చెల్లించేవారు.ప్రస్తుత అప్పీలులోని గ్రౌండ్స్ లో ఫిర్యాదికి, అతని న్యాయవాది, వాయిదా తేదిని తెలుపలేదు. మరియు ప్రాసెస్ ఫీని ట్రయల్ కోర్టులో చెల్లించలేదు. అందువలన ఫిర్యాదును కొట్టివేసిరి.

8. పైన తెలిపిన కారణములు దృష్ట్యా అప్పీలుదారుని తప్పు లేదని తెలియుచున్నది.

కాబట్టి అప్పీలుదారునకు ప్రాసెస్ ఫీని కట్టుటకును, కేసు కొనసాగించుటకు ఒక అవకాశము ఇవ్వవలెను.

9. ఆ ప్రకారము క్రిమినల్ అప్పీలు ఆమోదించబడినది II వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, సివిల్ కోర్టు, విజయవాడ వారు సి.సి.సంఖ్య. 145/2017లో తేది.02-08-2018నాడు ఇచ్చిన తీర్పు కొట్టివేయబడినది కేసులోని ఫిర్యాదు పునరుద్ధరించబడినది.ట్రయల్ కోర్టువారు జామీను ఇవ్వతగని అధికార పత్రము (ఎన్.బి.డబ్ల్యు)ను ప్రతివాది-ముద్దాయికి వ్యతిరేకముగా ఇప్పటికే జారీ చేసిరి. అందుచేత ప్రతివాది- ముద్దాయి, ఈ తీర్పు నకలు అందిన ఒక వారము లోపు ట్రయల్ కోర్టులో లోంగిపోవలెను. అట్టి లొంగుబాటు ద్వారా బెయిల్ నిబంధనలు ననుసరించి అతని కేసును పరిశీలించి అతనిని బెయిల్ పై విడుదల చేయుటకు ఆస్కారము కలుగును.

**గుడిసేవ శ్యామ్ ప్రసాద్, న్యాయమూర్తి**

**తేదీ: 22-10-2018**